క్లుప్తంగా

అవయవ దానంతో పునర్జన్మ

కాకినాడ రూరల్: ప్రపంచ అవయవ మార్పిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బతకడం కష్టమని వైద్యులు నిర్ధారిస్తే ఆ దేహం నుంచి 8 రకాల అవయవాలు ఎనిమిది మందికి దానం చేయవచ్చని వివరించారు. అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న లోవరాజు తదితరులు

కాకినాడ కల్చరల్: రెల్లి ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆల్ గవర్నమెంట్ రెల్లి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగారు లోవరాజు అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ జిల్లాస్థాయి సమావేశం ఆదివారం లోవరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికులకు పెన్షన్ తదితర ప్రయోజనాలను వెంటనే అందజేయాలన్నారు.అనంతరం సమావేశంలో ఏరియా కన్వీనర్లను ఎన్నుకొన్నారు. అసోసియేషన్ కాకినాడ కన్వీనర్‌గా బి.నరసింహారావును, గొల్లప్రోలు కన్వీనర్‌గా మీసాల అన్నవరం, తుని కన్వీనర్‌గా కె.సత్యనారాయణ, ద్రాక్షారామం కన్వీనర్‌గా బంగారు దేవి తదితరులను ఎన్నుకొన్నారు.

మండల పరిషత్ ఏఓ బాధ్యతల స్వీకరణ


చంద్రశేఖర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కాకినాడ రూరల్: మండల పరిషత్ పరిపాలన అధికారిగా ఏవీఎస్ చంద్రశేఖర్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇటీవల బదిలీల్లో భాగంగా కాకినాడ రూరల్‌కు బదిలీ అయ్యారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

రైల్వే సిగ్నల్ వ్యవస్థ తనిఖీ


సామర్లకోట స్టేషన్‌కు రైలులో వచ్చిన డివిజనల్ అధికారి ద్వివేది

సామర్లకోట: విజయవాడ డివిజన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరు జీకె ద్వివేది ఆదివారం విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. విశాఖ నుంచి విజయవాడ వరకు 18047 అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో ఆయన ప్రతి స్టేషన్‌ను పరిశీలించారు. స్థానిక స్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై ఆయనకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ స్వాగతం పలికారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు జోగారావు, నారాయణరాజు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్, జూనియర్ ఇంజినీరు సౌమ్య, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జైప్రకాష్ ప్రతిభ



షీల్డును చూపిస్తున్న విజేత జైప్రకాష్

కరప: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో మండలంలోని కూరాడకు చెందిన వనుం జైప్రకాష్ ప్రతిభ చూపి విజేతగా నిలిచాడు. విజయవాడలో ఆదివారం జరిగిన ఫైనల్స్ అండర్-9 విభాగంలో అతడు ప్రథమ స్థానంలో నిలిచాడు. చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీవీ శర్మ, సెక్రటరీ భీమారావు విజేత జైప్రకాష్‌కు చాంపియన్‌షిప్ షీల్డును అందజేశారు. జార్ఖండ్‌లో నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున అతడు పాల్గొంటాడని నిర్వాహకులు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి కొండ, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్ తదితరులు జైప్రకాష్‌ను అభినందించారు.

సప్తస్వర నీరాజనం

- వీనుల విందుగా కచేరీలు
- సంగీతజ్ఞుల నిలయంగా కాకినాడ
- ఉత్సాహంగా ప్రపంచ సంగీతోత్సవాలు


సత్కళావాహినిలో కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తదితరులు(ఫైల్)

కాకినాడ కల్చరల్: నగరం సప్తస్వర రాగడోలికల్లో ఓలలాడుతోంది. ప్రపంచ సంగీతోత్సవాలు సాగుతున్న వేళ ప్రఖ్యాత సంగీతజ్ఞుల ఆధ్వర్యంలో పలు వేదికలపై కళాకారులు కచేరీలు చేస్తూ ఆహూతులకు, కళాప్రియులకు వీనుల విందు చేస్తున్నారు. నగరంలోని సూర్యకళామందిర్, దంటు కళాక్షేత్రం, సత్కళవాహిని వంటి ఆడిటోరియంలలో సప్తస్వరాలు విన్యాసం చేస్తున్నాయి. నగరంలో సుమారు 50 మందికి పైగా ప్రఖ్యాతిగాంచిన సంగీత కళాకారులు ఉన్నారు. కర్ణాటక సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, సత్కళవాహిని వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు వంటి ఎందరో సంగీత విద్వాంసులు ఉన్నారు. అలాగే శ్రీరామసమాజం సంగీత కళాశాల, మంజరి సంగీత కళాశాల, సరస్వతీ గాన సభ సంగీత శిక్షణ కేంద్రం, సద్గురు సంగీత కళాశాల, శరణ్య స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, విద్యాధరి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ తదితర సంగీత కళాశాలలు సుమారు 20 వరకు ఉన్నాయి.

సంగీతంతో మానసిక ప్రశాంతత



సంగీతం మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంపొందిస్తుంది. సంగీతానికి రాళ్లు కరుగుతాయని, వరుణుడు వర్షిస్తాడన్నది నిర్వివాదాంశం. ప్రతీ ఇంటికి ఒక సంగీత కళాకారున్ని తయారు చేసి ఈ కళకు పూర్వవైభవం తీసుకొంచేందుకు కృషి చేస్తున్నా.

– డా.ఈవీ.కృష్ణమాచార్యులు, సంగీత విద్వాంసులు, కాకినాడ

సంగీతంపై మక్కువ పెంచాలి



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు సంగీతంపై మక్కువ పెంచాలి. ప్రతి విద్యార్థీ సంగీతాన్ని సాధన చేయాలి. దీంతో మన సంస్కృతి తరువాత తరాలకు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తు కాలంలో సంగీతానికి ఆదరణ మరింత పెరుగుతోంది.

– ఎస్‌కేడీ వెంకట్రావు, వేణుగాన విద్వాంసుడు, కాకినాడ

భారత సంస్కృతికి ప్రతిరూపం



భారత సంస్కృతికి సంగీతం ప్రతిరూపం. ఒక అపూరూప కళగా భావించి భక్తిశ్రద్ధలతో ఏకాగ్రతతో సంగీతాన్ని అభ్యసించాలి. మన సంగీత కళకు దేశవిదేశాలలో నానాటికి ఆదరణ పెరుగుతోంది. భారత దేశానికి ప్రపంచ దేశాలలో గుర్తింపు తెచ్చిన అంశాల్లో సంగీతం ఒకటని గుర్తించాలి. – పెద్దాడ సూర్యకుమారి, కర్ణాటక సంగీత విద్వాంసురాలు,కాకినాడ.

భావి తరాలకు సంగీతాన్ని అందించాలి



సంగీతాన్ని ప్రోత్సహించి అనేక మంది శిష్యులను తయారు చేస్తున్నాను. ప్రాచీన సంగీత కళ అంతరించి పోకుండా మన తర్వాత తరాలకు ఈ కళను బహుమతిగా అందించే ప్రయత్నం చేయాలి. ఈ కళను ఏకాగ్రతతో అభ్యసించాలి. సంగీతం మానసిక ప్రశాతంతను చేకూరుస్తుంది.

– చావలి సూర్యకుమారి, సంగీత విద్వాంసురాలు,కాకినాడ

వేద విజ్ఞాన ప్రతిష్టానమ్‌లో ప్రత్యేక పూజలు


వేదవిజ్ఞాన ప్రతిష్టానంలో నిర్వహిస్తున్న హోమం

బోట్‌క్లబ్: భానుసప్తమి సందర్భంగా స్థానిక రామారావుపేటలోని వేదవిజ్ఞాన ప్రతిష్టానంలో ఆదివారం పలు హోమాలు చేశారు. ప్రతిష్టానం కార్యదర్శి పుసులూరి ఫణిశర్మ పర్యవేక్షణలో వారాహి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా వచ్చేనెల 3న వేద విజ్ఞాన ప్రతిష్టానం వ్యవస్థాపకులు చెరుకుపల్లి లక్ష్మీనృశింహశర్మ చిత్రపటానికి శిష్యబృందం గురుపూజోత్సవం చేస్తున్నట్టు తెలిపారు. వారాహి అమ్మవారి మహిమ, విశేషాలను భక్తులకు వివరించారు.

పశువుల పాకలో గేదెల చోరీ

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు సమీపంలోని గండి రామకృష్ణకు చెందిన పశువుల పాకలో ఉన్న గేదెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రామకృష్ణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి పాలు తీసి గేదెలను మకాంలో ఉంచి ఇంటికి వెళ్లానని, ఆదివారం ఉదయం చూస్తే గేదెలు లేవని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు గేదెలు రూ.నాలుగు లక్షల విలువ చేస్తాయని రామకృష్ణ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి చిరునామా కొండబాబే

- బి–ఫారాలకూ సొమ్ము వసూళ్లు
- మండిపడ్డ జేసీఏ కన్వీనర్ సుంకర సాగర్


విలేకర్లతో మాట్లాడుతున్న సుంకర విద్యాసాగర్

కాకినాడ: టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తన హయాంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి కాకినాడ ప్రతిష్టను మంటగలిపారని, జగనన్న కన్వీనర్లు, సారథుల (జేసీఏ) కమిటీ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ విమర్శించారు. కాకినాడ రాజకీయ చరిత్రలో మల్లాడి స్వామి, ముత్తా గోపాల కృష్ణ, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నిబద్ధతతో పనిచేస్తే వనమాడి మాత్రం రాజకీయాన్ని వ్యాపారంగా మార్చుకున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని విమర్శించే అర్హత ఆయనకు లేదన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ద్వారంపూడి మెప్పుకోసం మాజీ మేయర్ శివప్రసన్న పాకులాడుతున్నారంటూ టీడీపీ నాయకులు చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. టీడీఆర్ బాండ్ల జారీ విషయంలో వాస్తవాలకు విరుద్ధంగా అభూత కల్పనలతో వనమాడి చేస్తున్న దుష్ప్రచారాన్ని మాత్రమే తాము తిప్పికొట్టామన్నారు. బాండ్ల జారీకి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నగరపాలక సంస్థ వద్దకు వెళ్లి నివృత్తి చేసుకోవచ్చునన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే అంతకుమించి ఆరోపణలు చేయగలమని పేర్కొన్నారు. వనమాడి వ్యవహారశైలి, అవినీతి, అసమర్థత వల్లే టీడీపీ కార్పొరేటర్లంతా పార్టీని వదిలి ద్వారంపూడికి చేరువయ్యారని ఆయన అన్నారు. తమకు కొండబాబు రాజకీయ భిక్ష పెట్టారంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. కొండబాబు కన్నా ముందు నుంచి తన తండ్రి సుంకర అన్నారావు, తమ కుటుంబం రాజకీయాల్లో ఉన్నామని, ఏనాడు కొండబాబుపై ఆధారపడలేదని, 1999కి ముందు వనమాడి ఎక్కడ ఉన్నారో చూసుకోవాలని హితవు పలికారు. సుంకర తిరుమల కుమార్, నున్న దొరబాబు, దూసర్లపూడి రమణరాజు, కర్రి శ్రీనివాస్ వంటి కాపు నాయకులను రాజకీయంగా వాడుకుని మొండిచేయి చూపించిన ఘనత కొండబాబుదేనన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు బాలాప్రసాద్, చవ్వాకుల రాంబాబు, గద్దేపల్లి దాసు, గోడి వెంకట్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక సార్వా ఆలస్యం


కరప శివారు కాలనీ సమీపంలో అసంపూర్తిగా నిర్మించిన తూము


కర్రకాలువ కిందికి రాకుండా మురుగు కాలువ వద్ద నిలచిన నీరు

- అసంపూర్తిగా న్యూ భీమన్న కర్రకాలువ పనులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

కరప: న్యూభీమన్న కర్ర కాలువకు నీరురాక సార్వా సాగు ఆలస్యమవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీరు వదలినా శివారు భూములకు నీరు అందడం లేదని, అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. మూడు పంటలు పండించాలంటే ముందస్తు సాగు చేపట్టాలని వ్యవసాయాధికారులు చెప్పడమే కానీ దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడంలేదని రైతులు అంటున్నారు. కరపలోని పంట పొలాలకు సంపర లాకుల నుంచి సంపర బోదీ, మెరక కాలువ, న్యూభీమన్న కర్రకాలువల ద్వారా సాగు నీరు సరఫరా చేస్తారు. శహపురం బడ్డీ నుంచి విడిపోయి న్యూభీమన్న కర్రకాలువ ద్వారా కరపలోని కొంత ఆయకట్టుకు సాగునీరు వస్తుంది. ఈ కాలువ పరిధిలో సుమారు వెయ్యి ఎకరాలు సాగవుతుంది. కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీ సమీపంలో న్యూభీమన్న కర్ర కాలువ కింద నుంచి ఉండే తూముల ద్వారా మురుగుకాలువలోని నీరు శహపురం డ్రెయిన్‌లో కలుస్తుంది. మురుగుకాలువలోని నీరు వెళ్లేందుకు కొత్త తూములు వేసేందుకు కర్రకాలువను తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. శివారు భూములకు నీరందడంలేదని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగకాలువ తూములు సరిచేసి, కర్రకాలువకు సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నగరంలో తొలకరి జల్లులు


విద్యుత్ నగర్‌లో రహదారిపై నిలచిన నీరు


వలసపాకల జంక్షన్‌లో కురుస్తున్న చిరు జల్లులు

బోట్‌క్లబ్: సుమారు రెండు నెలల పాటు ఎండలకు, ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు ఆదివారం కురిసిన తొలకరి వానలకు పులకించిపోయారు. వాతావరణం చల్లబడినా, గత నాలుగు రోజులుగా చిరుజల్లులు తప్ప వర్షం పడిన దాఖలాలు లేవు. తెల్లవారు జాము నుంచి ఉదయం 9 గంటలకు వరకూ పలు దఫాలుగా కురిసిన వర్షాలకు నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. రహదారులపై మోకాలిలోతు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఆదివారం కావడంతో రహదారులు ఖాళీగానే దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం చినుకులు తగ్గడంతో ప్రజలు తమ అవసరాల కోసం రోడ్డుపైకి వచ్చారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు కుటుంబాలతో సమీపంలోని పార్కులకు వెళ్లి కుటుంబ సభ్యులతో కాలక్షేపం చేశారు. దీంతో నగరంలోని గాంధీనగర్ పార్కు, బోట్‌క్లబ్ పార్కు, కుళాయిచెరువు పార్కు సందర్శకులతో కిటకిటలాడాయి.

చిరు జల్లులతో ఉపశమనం

కాకినాడ రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు ఇటీవలి చిరు జల్లులు, వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. నైరుతి రుతుపవనాల రాకతో మారిన వాతావరణంతో ఆదివారం రోజంతా కాకినాడ, పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి జల్లులు కురిసాయి. సెలవురోజు కావడంతో పిల్లలు, పెద్దలు, వృద్ధులు అంతా ఇళ్లలోనే సేదతీరారు.

పంట కాలువలో వ్యర్థ జలాలు వదిలితే సహించం

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం పంట కాలువలో రొయ్యల కంపెనీల వ్యర్థ జలాలను వదిలితే సహించబోమని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పాలెపు పోసియ్య, పంచాయతీ ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తిలు హెచ్చరించారు. పంట కాలువలో కలుషిత జలాలు కలుస్తుండడంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆదివారం వారు పంట కాలువను పరిశీలించారు. కలుషిత జలాలు కలవడంతో పంట కాలువ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. కాలువకు ఇరువైపులా ఉన్న రొయ్యల కంపెనీల పైపులైన్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు


కృష్ణను సత్కరిస్తున్న చంద్రకళాదీప్తి, బన్నీ

కాకినాడ క్రైం: త్వరలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా ఉచిత కంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి తెలిపారు. ఆదివారం శ్రీ రాగిరెడ్డి వెంకట జయ రామ్ కుమార్ (ప్రూటీకుమార్) చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం సేవల ముగింపు కార్యక్రమానికి చంద్రకళాదీప్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీజీహెచ్‌లో 71 రోజుల పాటు చలివేంద్రం సేవలు కొనసాగాయని, ఈ వ్యవధిలో మూడున్నర లక్షల మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామన్నారు. చలివేంద్రం నిర్వహణకు సహకరించిన ఎంఎల్ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, శానిటేషన్ కాంట్రాక్టర్ గోకెడ రాంబాబు, సిరి డెకార్స్ శ్రీను, బాలాజీ టెంట్ హౌస్ సోదరులు, బొండాడ సత్యనారాయణ, మిడిమళ కుమార్, వేమూరి రాము, అడబాల శ్రీను, రఫీ, తోకల గోపీలకు ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చలివేంద్రం నిర్వహణకు తమ వంతు సాయం అందించిన ప్రతి ఒక్కరినీ చంద్రకళా దీప్తి, బన్నీ సన్మానించారు.

మరిడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


మరిడమ్మ ఆలయం వద్ద భక్తుల కిటకిట

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు లక్ష వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

స్థానిక స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేసారు. స్థానిక వర్జుల వారి వీధిలో భువనేశ్వరి పీఠం అధిపతి చింతా గోపి శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా..

- నిలువ నీడలేక ప్రయాణికుల అవస్థలు
- నిరుపయోగంగా కాలిబాట వంతెన
- ప్రయాణికులు పెరుగుతున్నా బోగీలు అంతే


సామర్లకోటలో నిలువ నీడ లేని ప్లాట్‌ఫారం

సామర్లకోట: సామాన్య ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రైల్వే ప్రయాణికులు అంటున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలకు సరైన షెడ్లు లేక ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే కాలిబాట వంతెన ఉండటంతో ఎక్కడికో వెళ్లి ఎక్కలేక పట్టాలు దాటి వెళ్లడానికే ప్రయాణికులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకినాడకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ సామర్లకోటలోనే రైలు దిగాల్సి ఉంటుంది. అలాగే మెట్ట ప్రాంతాలైన జగ్గంపేట, పెద్దాపురం నుంచి, ఏజెన్సీ ప్రాంతాలు ఏలేశ్వరం, గోకవరం, మారేడుమిల్లి, వై.రామవరం తదితర ప్రాంతాల ప్రజలు హైదరాబాద్, విశాఖలవైపు వెళ్లాలన్నా సామర్లకోట రైల్వే స్టేషన్‌ను ఆశ్రయించాల్సి ఉంటుంది. నిత్యం సుమారు 9 వేల మంది రిజర్వేషన్లు, 25 వేల వరకు సాధారణ బోగీలలో ప్రయాణిస్తుంటారు.

ఈ స్టేషన్ మీదుగా 36 ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా, వారికి అనుగుణంగా బోగీల సంఖ్య పెంచకపోవడం శోచనీయమం. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు కనీసం నాలుగు సాధారణ భోగిలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏళ్లు గడుస్తున్నా సౌకర్యాలు కరువే



సాధారణ ప్రయాణికులు వేచి ఉండేందుకు షెడ్లు లేవు. ప్రస్తుత వర్షాల వల్ల తడి చేతులతో బోగీలు ఎక్కితే జారిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి షెడ్లు ఏర్పాటు చేయాలి.

– ఘంటశాల సత్యమణిదీప్, ప్రయాణికుడు

అమృత భారత్ స్టేషన్‌గా గుర్తింపు



కోవిడ్‌కు ముందు నియమించిన 12 మంది పారిశుధ్య కార్మికులను ఆరుకు కుదించారు. దీనివల్ల పారిశుధ్య లోపం తలెత్తుతోంది. ఈ స్టేషన్‌ను అమృత భారత్ స్టేషన్‌గా గుర్తించారు. దీంతో ప్లాట్‌ఫారాలపై షెడ్లు, రెండో కాలిబాట వంతెన, లిఫ్ట్ వచ్చే అవకాశం ఉంది. రిజర్వేషను ప్రయాణికుల ద్వారా నెల 50 లక్షలు, సాధారణ ప్రయాణికుల ద్వారా నెలకు రూ.1.3 కోట్లు ఆదాయం వస్తుంది. నిత్యం 8 నుంచి 10 వేల మంది ప్రయాణిస్తారు.

– ఎం.రమేష్, స్టేషన్ మేనేజర్, సామర్లకోట

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి జగనన్న లేఅవుట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన చెప్పిన వివరాల ప్రకారం శనివారం రాత్రి చొల్లంగి గ్రామానికి చెందిన గంపల మణికంఠ బైక్‌పై కాకినాడ వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, యానాం నుంచి వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణికంఠతో పాటు తండ్రీకుమారులైన చందక అప్పారావు, చందక కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసకుమార్ తెలిపారు.